క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలు అందించండి



విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న ప్రశాంత్

రాపూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రశాంత్ అన్నారు. రాపూరు మండలం తెగచర్ల గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆదివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. హెల్త్ క్లినిక్‌లకు అందించిన వైద్యపరికరాలను గురించి వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకుని తగిన సూచనలు అందించారు. ఆయన వెంట వైద్యసిబ్బంది సురేష్ ఉన్నారు.

నేటి నుంచి మౌలాలి పంజా ఉత్సవాలు



గరిడిలోని తాలీమ్‌ఖానా

నాయుడుపేటటౌన్: పట్టణంలోని గరిడీ వద్ద మొహరం పండుగను పురస్కరించుకుని జరిపే పీర్లపండుగలో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు మౌలాలి పంజా ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నట్లు గరిడీ యువత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి గుర్రంపై మౌలాలి పంజాను ప్రతిష్ఠించి పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హజరత్ మౌలాలి తాలీమ్ ఖానా యువజన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు వేణుంబాకంలో గడప గడపకు మన ప్రభుత్వం

దొరవారిసత్రం: వేణుంబాకం గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

గుండవోలులో గడప గడపకు..

రాపూరు: గుండవోలు గ్రామంలో సోమవారం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కంబాలపల్లిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొంటారని తెలిపారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం

కోట: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల భవనాల మరమ్మతులకు పాఠశాల పూర్వ విద్యార్థి రౌతు రామక్రిష్ణ రూ.2.50లక్షల విరాళం అందించినట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. వాకాడు జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత రౌతురామక్రిష్ణను ఇటీవల కలిశామని, ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలకు తనవంతుగా సాయం చేసేందుకు ముందుకొచ్చారన్నారు. పాఠశాలలో దెబ్బతిన్న భవనాలు, తలుపులు, కిటికీల మరమ్మతులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

కండలేరులో 18.138 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 18.138 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,300 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిజ్‌కు120, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరురూరల్: గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో జైన్ సంఘం ఆధ్వర్యంలో చెన్నై మెట్రో మహావీర్ క్లబ్ సహకారంతో తిరుపతి కంటి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. జైన్ సంఘం సభ్యుడు ధర్మీచంద్, జైన్ సంఘం ప్రతినిధులు రమేష్‌కుమార్, సుభాష్, అజిత్, చిన్నరాజ్, నిలేష్, అశోక్ పాల్గొన్నారు.

గ్రామసేవకు మకుటం సచివాలయం

- గడప గడపకు అందుతున్న ప్రభుత్వ సేవలు
- సమస్యలు వెంటనే పరిష్కారం
- లబ్ధిదారుల కష్టాలకు తెర



వెంకన్నపాలెంలో సచివాలయం

మండలం : కోట
మొత్తం సచివాలయాలు : 16
సచివాలయ సిబ్బంది : 128
వలంటీర్ల సంఖ్య : 292
అందించిన సేవలు : 38 వేలు

కోట: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి గొప్ప ఆశయం నేడు సత్ఫలితాలనిస్తోంది. సచివాలయ వ్యవస్థతో గడప గడపకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ప్రజల కష్టాలు, వారి సమస్యలు తీర్చేలా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పల్లెసీమల్లో పారదర్శక పాలన అందుతోంది. పింఛన్ నుంచి సర్టిఫికెట్ల వరకు వీధి సమస్యలైనా, ప్రజాసమస్యలైనా అన్ని పనులూ సచివాలయాల్లోనే పూర్తవుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ వ్యవస్థకు ముందు ఏ చిన్న పనికావాలన్నా మండల కేంద్రానికి వచ్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రజలకు సమయం, ఖర్చు వృథా కాగా పని అయ్యే వరకు పడిగాపులు తప్పేవికావు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలకు ప్రభుత్వ సేవలు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. మారుమూల గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రం చుట్టూ తిరిగే కష్టానికి తెరపడింది. 50ఇళ్లకు ఒక వలంటీర్ పనిచేస్తుండడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం ఇంటి నుంచే వాటిని అందుకోవడం సాధ్యమవుతోంది. సచివాలయాల ద్వారా ఒకే ప్రాంగణంలో 35 ప్రభుత్వ శాఖల పనులు చేయించుకునే అవకాశం కలిగింది. ప్రతి సచివాలయంలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను నోటీస్‌బోర్డులో ప్రదర్శిస్తున్నారు.

పది నిమిషాల్లో మ్యుటేషన్ అందింది.



విద్యానగర్‌లో ఇల్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. అయితే ఇంటికి సంబంధించి మ్యుటేషన్ పూర్తికాక ఇబ్బందులు పడ్డా. మా వలంటీర్ ద్వారా సచివాలయానికి వెళ్లి సిబ్బందిని సంప్రదించా. పది నిముషాల్లోనే పని పూర్తిచేసి మ్యుటేషన్ సర్టిఫికెట్ తీసుకున్నా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– ముత్తుకూరుకు సుభాన్

పింఛన్ అందేలా చేశారు



వృద్ధాప్య పింఛన్ ఆగిపోవడంతో ఇబ్బంది పడ్డా. 300 యూనిట్ల కరెంట్ వినియోగించానని పింఛన్ ఆగిందని చెప్పారు. నేను అంత కరెంటు వాడలేదు. సచివాలయంలో సంప్రదించగా సిబ్బంది విద్యుత్ అధికారులను తీసుకెళ్లి పరీక్షించారు. విద్యుత్ మీటర్ పక్కనే మరో మీటర్‌తో మ్యాపింగ్ అయినట్లు గుర్తించి సమస్యను పరిష్కరించారు. తిరిగి పింఛన్ అందేలా చేశారు.

– లక్ష్మమ్మ, కోట

సేవకు సలాం



కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్న వలంటీర్లు, వైద్య సిబ్బంది(ఫైల్)



కోవిడ్ సమయంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

వలంటీర్లకు వందనం

పెళ్లకూరు: కరోనా మహమ్మారి బారిన పడిన వారికి, వారి కుటుంబసభ్యులకు గ్రామ వలంటీర్లు అన్ని విధాలా అందుబాటులో ఉంటూ అనేక సేవలు చేశారు. ముఖ్యంగా కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ ముఖానికి మాస్క్ ధరించి ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించారు. వైద్యసిబ్బందితో కలిసి జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారిని కోవిడ్ పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి కరోనా పరీక్షలు చేయించారు. కరోనా నిర్ధారణ అయిన వారికి అయినవారు, కుటుంబసభ్యులు ప్రాణభయంతో దూరంగా ఉన్నప్పటికీ గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాల్లో ఉంచి వారికి క్రమం తప్పకుండా ఆహారం, మందులు అందజేశారు. అలాగే ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కరోనా సమయంలో ప్రాణభయంతో ప్రజలు ఇల్లు విడిచి బయటకు వచ్చేందుకు భయంతో వణికిపోతున్న తరుణంలో మేమున్నామంటూ వలంటీర్లు ముందుకొచ్చి ప్రాణాలకు తెగించి అన్ని విధాలా ప్రజలకు సేవలు అందించారు.

వలంటీర్ల సేవలు మరువలేం



కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించారు. కరోనాతో బాధపడుతున్న వారికి మందులు, ఆహారం అందిస్తూ ప్రాణాలు కాపాడిన దేవుళ్లు. కోవిడ్‌తో మృతి చెందిన వారిని కుటుంబసభ్యులు పట్టించుకోకపోయినా వలంటీర్లు స్థానిక పోలీసులతో కలిసి దహన సంస్కారాలు కూడా చేయించారు.

– వెంకటేశ్వర్లు, చెంబేడు

గుర్రపు డెక్కతో పూడిపోతున్న బల్లవోలు డ్రైన్

- దిగువకు వెళ్లని వరద నీరు
- రైతుల అవస్థలు



బల్లవోలు డ్రైన్‌లో గుర్రపు డెక్క తీగలు

చిల్లకూరు: తీర ప్రాంతంలో సొనకాలువల ద్వారా చేరే నీటితో పాటు, కోట మండలం పెన్నాక చెరువు కలుజు ద్వారా వచ్చే నీరు, ఎగువ ప్రాంతంలోని వరద నీరు బల్లవోలు డ్రైన్ ద్వారా కండలేరు క్రీక్‌లోకి చేరుతుంది. అయితే బల్లవోలు డ్రైన్ నేడు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోవడంతో వరద నీరు దిగువకు వెళ్లక పంటలు ఆలస్యంగా వేసుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న క్రమంలో బల్లవోలు డ్రైన్‌లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించకుంటే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో 2 వేల ఎకరాల పంట పొలాలు నీటిలో ఉండిపోవాల్సి వస్తుంది. దీంతో వేళ్లపాళెం, బల్లవోలు, కోరావారిపాళెం గ్రామాల రైతులు సకాలంలో పంటలు వేసుకోలేక అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. రైతులు బల్లవోలులోని డ్రైన్‌లో ఉన్న గుర్రపు డెక్కను ఉపాధి ద్వారానైనా తొలగించేలా నీటి పారుదల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. త్వరలో వర్షాలు ప్రారంభం కానున్న క్రమంలో బల్లవోలు డ్రైన్ పారుతున్న మూడు కిమీ దూరాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పంటలు వేసుకునేలా చూడాలని రైతులు విన్నవిస్తున్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో మహిళలు

రాపూరు: మణిపూర్‌లో ఒక తెగకు చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రను చేసి ఊరేగించి సామూహిక లైంగికదాడికి పాల్పడినందుకు రాపూరులో రైతు కూలీ, స్త్రీ విముక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యత కేంద్రప్రభుత్వానిదేనన్నారు. స్త్రీ విముక్తి జిల్లా కార్యదర్శి కొండమ్మ, అధ్యక్షురాలు రత్నమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత, రైతుకూలీ సంఘం నాయకులు సుబ్బరాయులు,రమణయ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఒక వైపు వర్షం పడుతున్నప్పటికీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పరమేశ్వర్

సూళ్లూరుపేట: పట్టణంలోని బాలికల హైస్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్, కోగిలి జయరామిరెడ్డి చారిటబుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని స్థానిక డాక్టర్ పి.పరమేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. శిబిరంలో 230 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. ఇందులో 70 మందికి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. 70 మందికి లయన్స్‌క్లబ్, కోగిలి జయరామిరెడ్డి చారిటబుల్ సొసైటీ సహకారంతో తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, ప్రాజెక్ట్ చైర్మన్ వసుంధర, లయన్స్‌క్లబ్ సభ్యులు కాళంగి ప్రభాకర్, కోగిలి జయరామిరెడ్డి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి సురేష్‌రెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, రాజేష్, మోహన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేత

గూడూరు రూరల్: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో ఆదివారం రోటరీ దివ్యాంగుల భరోసా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. సీనియర్ రొటేరియన్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు నరసప్ప, ఉపాధ్యక్షుడు వాసుగౌడ్, శివప్రసాద్, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, గిరి, దాత శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గూడూరురూరల్: గూడూరు పట్టణంలో సోమవారం పూర్తి స్థాయిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంతరాజుపాళెం దగ్గర 600 ఎం.ఎం. జీఆర్‌పీ పైపులైన్ లీకేజీ కారణంగా, కండలేరు డ్యాం వద్ద కరెంటు సరఫరా సరిగ్గా లేనందున సోమవారం పట్టణంలో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా అందించేందుకు అంతరాయం ఏర్పడుతుందని, పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

వాకాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ గోపీనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

సంచార వైద్యం..పాడి రైతులకు వరం

- మండలంలో వైఎస్సార్ సంచార వైద్యానికి విశేష స్పందన
- ఇంటి వద్దే అత్యవసర వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



పశువు కొమ్ముకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యులు



వైఎస్సార్ పశు సంచార వాహనం

సూళ్లూరుపేట రూరల్: దేశంలో ఎక్కడ లేని విధంగా వైఎస్సార్ సంచార వైద్యశాల పాడి రైతులకు గ్రామాల్లో వరంగా మారింది. 1962 నంబర్‌కు ఫోన్ చేసిన వెంటనే పశు వైద్యులు వాహనంతో గ్రామాలకు అరగంటలో చేరుకుని ఇంటివద్దే అత్యవసర వైద్యసేవలతో పాటు పశువులకు ఆపరేషన్‌లు చేసి జీవాలను కాపాడుతున్నారు. దీంతో గ్రామాల్లో వైఎస్సార్ సంచార వాహనం ద్వారా వైద్యసేవలు అందుతుండడంతో పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాక వద్దనే పశు వైద్యం...

పశువు సంపద, జీవ సంపద పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశువైద్యశాలలు (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) ద్వారా కాపర్లకు ఎంతో అద్భుతమైన సేవలు అందుతున్నాయి. జీవాలకు ఎలాంటి జబ్బుచేసినా 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగానే అరగంటలోపు పశువుల పాక వద్దకు చేరుకుంటున్నారు. ఉచితంగా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తూ అవసరమైతే శస్త్రచికిత్సలు చేస్తూ పశువుల ప్రాణాలను వైద్యులు కాపాడుతున్నారు.

మెరుగైన చికిత్సకోసం ఉచిత రవాణా


108 వాహనం ఎలా సేవలు అందిస్తుందో అలానే మూగజీవాలకు 1962 వైఎస్సార్ సంచార పశువైద్యశాల ద్వారా తక్షణమే వైద్యసేవలు అందుతున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో రెండు వాహనాలు ఉండగా ఇందులో ఒక వాహనం తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు కేటాయించారు. ఇందులో ఒక పశువైద్యుడు, వెటర్నరీ డిప్లొమా చేసిన సహాయకుడు, వాహన పైలట్‌తో పాటు ఒక అసిస్టెంట్ ఉంటారు. వాహనంలోనే జీవాలకు కావాల్సిన మందులు ఉంటాయి. పశువులకు ప్రాథమిక వైద్య సేవలతో పాటు మేకలు, గొర్రెలు, పశువులకు మేజర్, మైనర్ సర్జరీలు చేస్తున్నారు. వాహనంలోనే హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యం కూడా ఉంది. దీని ద్వారా మెరుగైన వైద్య సేవలు కోసం అత్యవసర పరిస్థితులో పశువులను వాహనంలో ఎక్కించుకుని దగ్గరలో ఉన్న పశువైద్యశాలలకు తరలించి వైద్యం అందిస్తారు. అక్కడ కూడా పశువులకు సరైన వైద్యం అందకపోతే పట్టణాల్లో ఉన్న యూనివర్సిటీ వంటి పశువైద్యకళాశాల ప్రాంతాలకు తరలించి వైద్యం అందిస్తారు. ముఖ్యంగా పాడి రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండానే 1962 వాహనం ద్వారా తీసుకెళ్తారు. వైద్యం అందించిన తరువాత అదే వాహనంలో ఇంటికి చేరుస్తారు. గతంలో పాడి రైతులు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేసి పశువులను వాహనంలో వైద్యశాలకు తరలించుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జగనన్న సర్కారు ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుసంచార వాహనం ద్వారా మేజర్ సిజేరియన్లు, కొమ్ము విరిగినా సర్జరీలు కూడా చేస్తున్నారు. ముఖ్యంగా పశువులు గర్భందాల్చి లేగదూడలు కడుపులో అడ్డం తిరిగినప్పుడు ఇంటి వద్దకే వచ్చి పశువుకు శస్త్రచికిత్స చేసి పశువు, లేగదూడలను సురక్షితంగా కాపాడుతున్నారు. దీంతో పాటు పశువుల కొమ్ములు విరిగిపోతే తీవ్ర రక్తస్రావం జరిగి అతి తక్కువ రోజుల్లో పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. దీనికి కూడా శస్త్రచికిత్సలు చేసి కాపాడుతున్నారు.

1962 ఎంతో ఉపయోగకరం




నా ఎద్దు కొమ్ము విరిగిపోయింది. పశువుకు తీవ్ర రక్తస్రావం ఏర్పడింది. వెంటనే 1962 వాహనానికి ఫోన్ చేశాను. అరగంటలో ఇంటి వద్దకు చేరుకుని విరిగిన కొమ్మును తొలగించి శస్త్ర చికిత్స చేశారు. పశువును బతికించారు. 1962 వాహనం పాడి రైతులకు ఎంతో ఉపయోగం. . – సుబ్రమణ్యం రెడ్డి ,వాటంబేడు

కొమ్ములు విరిగినా ఇబ్బంది పడొద్దు



పశువులకు కొమ్ములు విరిగినప్పుడు చాలమంది పాడి రైతులు జీవాలను తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. ఇలాంటి సమస్యకు కూడా శస్త్రచికిత్స చేసి కాపాడుతాం. ఫోన్ వచ్చిన వెంటనే వాహనంలో గ్రామాలకు వెళ్లి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. – సూర్య, 1962 వాహన పశువైద్యులు


సిజేరియన్ చేసి కాపాడారు



నా ఆవు గర్భం దాల్చి కడుపులో లేగ దూడ అడ్డం తిరిగింది. చనిపోయేప్రమాదం ఏర్పడింది. వెంటనే 1962 వాహనానికి ఫోన్ చేశాను. వైద్యులు వాహనంతో ఇంటికి వచ్చి పశువుకు సిజేరియన్ చేసి కాపాడారు.

-బాలసుబ్రమణ్యం , కొమ్మినేనిపల్లి

పాడి రైతులకు ఇబ్బందులు తగ్గాయి



దూరప్రాంతాలకు వెళ్లి పశువులకు వైద్యం చేయాలంటే పాడి రైతులకు ఖర్చుతో కూడిన పని. 1962 వాహనం ద్వారా ఆ బాధ తప్పింది. పశు సంచార వాహనం వచ్చిన తరువాత పట్టణాలు, మండల కేంద్రాల్లో ఉన్న పశువైద్యశాలలకు పాడి రైతుల రాక చాల వరకు తగ్గిపోయాయి. – వరలక్ష్మి, వెటర్నరీ ఏడి, సూళ్లూరుపేట

చేనిగుంట గ్రామస్తులకు తాగునీటి ఇక్కట్లు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తడ: రాజకీయ చదరంగంలో చేనిగుంట పంచాయతీకి చెందిన గిరిజన, దళిత కుటుంబాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు.. గత పంచాయతీ ఎన్నికల్లో చేనిగుంట పంచాయతీ సర్పంచ్‌గా బీజేపీ మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తల్లి బుజ్జమ్మ టీడీపీతో పోరాడి గెలిచారు. వయోభారంతో ఆమె పంచాయతీ బాధ్యతలు చూడలేకపోవడంతో ఆమె రెండో కుమారుడు చంద్రారెడ్డి పంచాయతీ వ్యవహారాలు చూస్తున్నారు. ఈక్రమంలో గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా నెలకొంది. దీనిపై గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ, పెద్దలకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. అనంతరం అధికారులు కలుగజేసుకుని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. ఇటీవల చేనిగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకి సమస్య చెప్పడంతో జలజీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్ వేసి సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన పనులు మొదలు పెట్టడంతో కొంతమంది పనులు అడ్డుకోవడంతో సమస్య అక్కడే ఆగిపోయింది. ఈ క్రమంలో ఆదివారం దళితవాడకు చెందిన కొంతమంది యువకులు సర్పంచ్ ఇంటికి వెళ్లి నిలదీయడంతో దాటవేసే ధోరణిలో వ్యవహరించినట్టు గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై ఎంపీడీఓ ఆమోసుబాబు స్పందిస్తూ పైప్‌లైన్ వేసేందుకు కొంతమంది అడ్డుపడింది నిజమేనని దీనిపై సోమవారం రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించి నీటి సమస్య తీర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తున్న యువత

నాయుడుపేటటౌన్: సినీ నటుడు సూర్య పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఆయన అభిమాన సంఘ యువత ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎల్‌సీఎం పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యుడు బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం స్థానిక వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్య అభిమాన సంఘ అధ్యక్షుడు హరిష్, సన్నీ పాల్గొన్నారు.

చర్చిలో శాంతి ప్రార్థనలు



శాంతి ప్రార్థనలు చేయిస్తున్న బిషప్

కోట: విద్యానగర్ హోలీ ప్రేయర్ చర్చిలో ఆదివారం మణిపూర్ దారుణ హింసాకాండను నిరసిస్తూ శాంతి ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ ప్రదీప్‌కుమార్ మణిపూర్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. ఇలాంటి దురాగతాలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. మణిపూర్ క్రైస్తవుల కోసం క్రైస్తవ సంఘాలు అండగా ఉండాలన్నారు. స్వరూప్ పాల్గొన్నారు.